# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పేదలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛను పంపిణీ గొప్ప సంక్షేమ కార్యక్రమమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో త్వరలో పట్టాదారు పాసు పుస్తకాలను తపాలా శాఖ ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.**

4. **రైల్వే జోన్ కు అనుగుణంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ అన్నారు.**

=========================

పేదలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛను పంపిణీ గొప్ప సంక్షేమ కార్యక్రమమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకుంటున్న లక్షలాది మంది లబ్దిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈమేరకు స్పందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 50 వేల కోట్లరూపాయలకు పైగా మొత్తాన్ని పింఛన్లకు వినియోగిస్తున్నామని, 63.12 లక్షల మందికి పింఛను ఇచ్చేందుకు 2743 కోట్లు విడుదల చేశామని చెప్పారు. 1వ తేదీన పింఛను ఇవ్వాల్సి ఉన్నా కొత్త ఏడాది సందర్భంగా ఒక రోజు ముందే 31వ తేదీనే ఇళ్ల వద్ద పింఛన్ నగదు అందించేలా ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం, పార్వతీపురం మన్యం, ఎన్టీఆర్ జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని లబ్దిదారులకు నగదు అందజేశారు. నెల్లూరు టౌన్ భగత్ సింగ్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్... 26 సెకన్లు

-------------------------

ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం రాజోలు పాడు గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఈ రోజు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని తెలిపారు. వచ్చే నెల 2 వ తేదీ నుంచి పట్టాదారు పాసు పుస్తకాలను అందించనున్నామని చెప్పారు. రైతులు కార్యాలయాలకు రాకుండా త్వరలో పట్టాదారు పాసు పుస్తకాలను తపాలా ద్వారా పంపించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరిస్తూ,

వాయిస్..29 సెకన్లు

---

ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఏడాది విద్యుత్ ఛార్జీలను పెంచలేదని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై సౌర ఫలకాల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 23 సెకన్లు

---

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలిచింది. 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో భారతదేశం ప్రపంచపు కొత్త ఉత్పాదక కేంద్రంగా సాధించిన పురోగతిపై ఆకాశవాణి అందిస్తున్న కథనం..

2025లో పారిశ్రామిక, ఆర్థిక ప్రగతిలో 7.8 శాతం అంచనా వృద్ధి రేటుతో భారత్ ఒక నిర్ణయాత్మక మలుపుకు చేరుకుంది. ఈ సంవత్సరం నోయిడాలో భారతదేశపు మొట్టమొదటి మొబైల్ స్క్రీన్ టెంపర్డ్-గ్లాస్ తయారీ కర్మాగారం ప్రారంభమైంది, అదేవిధంగా ఇంధన రంగంలో, దేశం 100 గిగా వాట్ల సౌర ఉత్పాదక సామర్థ్యాన్ని సాధించడం ద్వారా ఒక ప్రధాన మైలురాయిని చేరుకుంది. జాతీయ నిరుద్యోగ రేటు కూడా 5 శాతానికి తగ్గింది. ఈ విధంగా నైపుణ్యం కలిగిన శ్రామికశక్తితో భారతదేశం ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఉత్పత్తి, ఎగుమతి ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించింది. పెరుగుతున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విస్తరిస్తున్న పారిశ్రామిక సామర్థ్యంతో 2025 సంవత్సరంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా, ప్రధాన ప్రపంచ ఉత్పాదక కేంద్రంగా మారింది.

---

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు అనుగుణంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, రైల్వే స్టేషన్ ను 14 ప్లాట్ ఫారాలకు విస్తరిస్తున్నామని చెప్పారు. జోన్ కార్యాలయాల నిర్మాణాలు కొనసాగుతున్నాయని శ్రీభరత్ వివరిస్తూ,

వాయిస్.. 29 సెకన్లు

---

అన్న క్యాంటీన్‌లలో నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. గుంటూరు మిర్చి యార్డులోని అన్న క్యాంటీన్ ను నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి ఈ రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారీగా అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసే వారి సంఖ్యను, నిర్వహణ, శుభ్రత పనులు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లో ఆహార సరఫరాతో పాటు, ఇతర మౌలిక సౌకర్యాల నిర్వహణను నగరపాలక సంస్థ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

---------------------------

సంక్రాంతి పండగకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 11 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే నెల 7 నుంచి 12వ తేదీ మధ్య కాకినాడ-వికారాబాద్, వికారాబాద్-పార్వతీపురం, పార్వతీపురం-వికారాబాద్, పార్వతీపురం-కాకినాడ టౌన్, సికింద్రాబాద్-పార్వతీపురం, కాకినాడ టౌన్-వికారాబాద్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయని పేర్కొంది. ఆయా రైళ్లలో ఏసీ, స్లీపర్ కోచ్‌లతో పాటు సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటాయయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

---------------------------

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తిరుపతి జిల్లాలో డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగం, అశ్లీల నృత్యాలు పూర్తిగా నిషేధించామని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా కొన్ని ఆంక్షలు విధించామన్నారు. నిర్ణీత సమయానికి హోటళ్లు, మద్యం దుకాణాలు, బార్లు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని సూచించారు. .పట్టణాలు, ప్రధాన రహదారులపై ప్రత్యేక పోలీస్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలవరం, మార్కాపురం జిల్లాలకు ప్రభుత్వం ఉన్నతాధికారులను నియమించింది. కలెక్టర్, ఎస్పీ, జేసీలను నియమిస్తూ నిన్న ఆదేశాలు జారీ చేసింది. పోలవరం జిల్లాకు ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా ఎ.ఎస్.దినేశ్ కుమార్, ఇన్‌ఛార్జి ఎస్పీగా అమిత్ బర్దర్, ఇన్‌ఛార్జి జేసీగా తిరుమణి శ్రీపూజను నియమించారు. అలాగే మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా పి.రాజాబాబు, ఇన్‌ఛార్జి ఎస్పీగా వి.హర్షవర్ధన్ రాజు, ఇన్‌ఛార్జి జేసీగా రోణంకి గోపాలకృష్ణను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

======================